www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 16 ఫిబ్రవరి 2023

5

ఏలూరు

డిఇఒగా రవిసాగర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమమైన ఫలితాలు సాధించేలా పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి.రవిసాగర్ తెలిపారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో రవిసాగర్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మొదట ఆయన జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా ఏర్పడిన కోనసీమ జిల్లాకు డిఇఒగా వ్యవహరిస్తున్నారు. సాధారణ బదిలీలో భాగంగా ఆయనను ఏలూరు జిల్లా డిఇఒగా నియమించారు. ఈ క్రమంలో ఆయన బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఏలూరు జిల్లాలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను తీసుకువచ్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతం ఉపాధ్యాయుల పనితీరు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతానన్నారు.

పట్టిసీమ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

అధికారులతో జెసి పి.అరుణ్‌బాబు సమీక్ష

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పట్టిసం క్షేత్రంలో నిర్వహించే శ్రీభద్రకాళి, వీరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల్లో యాత్రికులకు ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జెసి పి.అరుణ్‌బాబు తెలిపారు. పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల మూడో సమావేశం బుధవారం పట్టిసం ఫెర్రీ పాయింట్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలకు పట్టిసీమ క్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పట్టిసం ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు ఇబ్బంది కలుగకుండా, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 17 నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో సామాన్య యాత్రికులకు ప్రాధాన్యతనిచ్చే విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా నిర్దేశించిన పనులు ఏమేరకు పూర్తయ్యాయో సంబంధిత అధికారులను అడిగితెలుసుకున్నారు. దేవాదాయశాఖకు సంబంధించి 80 నుంచి 90 మంది ఆలయంలో విధులు నిర్వర్తిస్తారన్నారు. పోలీసు అధికారులతో సమీక్షిస్తూ ఐదు పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయడంతో పాటు ఆర్‌టిసికి రెండు, విఐపి వాహనాలకు ఒక పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. అదేవిధంగా యాత్రికులకు కూడా పోలీసులు సూచనలు మేరకు నడుచుకోవాలని చెప్పారు. గోదావరి నదీ విధులకు నదిలోతు వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల నుండి సమాచారం రాబట్టాలని డిఎస్‌పి లతా కుమారిని ఆయన ఆదేశించారు. అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం ఆర్‌టిసికి సంబంధించి వంద బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టిసీమ ఫెర్రీ నుండి యాత్రికులు నది దాటేందుకు కాకినాడ పోర్టు ఆధ్వర్యంలో ఐదు పంట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆటోల్లో రవాణాకు సంబంధించి పరిమిత సంఖ్యలోనే ప్రయాణికులను తీసుకురావడంపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించి మూడు షిఫ్టుల్లో సుమారు 70 మందికి పైగా సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. ప్రత్యేక డిటిఆర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. లైన్‌మెన్ల పేరు, ఫోను నెంబర్లు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, డిఎస్‌పి, పోలవరం తహశీల్దార్లకు అందజేయాలని ట్రాన్స్ కో అధికారులను జెసి ఆదేశించారు. పట్టిసం క్షేత్రంలో అత్యవసర సేవలు అందించేందుకు రెండు అత్యవసర బోట్లను సిద్ధం చేయాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి నాలుగు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతోపాటు సుమారు 170 సిబ్బంది విధులు నిర్వర్తిస్తారన్నారు. అత్యవసర మందులను అందుబాటులో ఉంచడంతోపాటు 108, 104 సిబ్బందిని మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉంచాలన్నారు. వారి పేర్లు, ఫోన్ నెంబర్లను జంగారెడ్డిగూడెం డిఎస్‌పికి అందజేయాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు. మూడు రోజుల పాటు పట్టిసం క్షేత్రం పరిధిలో మద్యం షాపులను మూసివేసి ఉంచడంతోపాటు బయట మద్యం విక్రయాలకు తావులేకుండా గట్టి నిఘా ఉంచాలని ఎక్సైజ్ అధికారులను జెసి ఆదేశించారు.

ఏర్పాట్లను పరిశీలించిన జెసి

అనంతరం ఉత్సవాలకు ముస్తాబవుతున్న పట్టిసీమ క్షేత్రంలో ఏర్పాట్లను అధికారులతో కలిసి జెసి పరిశీలించారు. ఇసుకతెన్నెలపై చలువ పందిళ్లు, స్నాన ఘట్టాల వద్ద మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకొనేందుకు నిర్మించిన తాటాకు గదులను ఆయన పరిశీలించారు. ఆర్‌అండ్‌బికి సంబంధించి ఇంకా పనులు మిగిలి ఉన్నాయని, వాటిని గురువారం సాయంత్రంలోగా పూర్తిచేయాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. దర్శనం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లను పరిశీలించారు. మూడు లక్షలకుపైగా తాగునీటి ప్యాకెట్లను సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం విషయంలో ఉత్సవం ముగిసిన అనంతరం కూడా గ్రామం అంతా పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. గజఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉత్సవకమిటీ ఛైర్మన్, ఆర్‌డిఒ జాన్సీరాణి, ఆలయధర్మకర్త వీరభద్రరావు, దేవాదాయ డిప్యూటీ కమిషనరు ఆర్.విజయరాజు, జంగారెడ్డిగూడెం డిఎస్‌పి లతాకుమారి, ఆలయ ఇఒ ఎంఎస్.శర్మ, ఆర్‌టిసి జిల్లా అధికారి వరప్రసాదరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, డిఎస్ఒ ఆర్‌ఎస్‌ఎస్‌ఎస్.రాజు, వ్యవసాయశాఖ జెడి వై.రామకృష్ణ, డిఎంహెచ్‌ఒ నాగేశ్వరరావు, డిపిఒ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎన్‌విపి.సత్యనారాయణ, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, సర్పంచి శ్రీరామ్మూర్తి, హకుంపేట జమీందార్ పి.సీతారామస్వామి, తహశీల్దారు సుమతి, ఎంపిడిఒ శ్రీనివాసబాబు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి

ఏలూరు కార్పొరేషన్ మేనేజర్ మూర్తి సస్పెన్షన్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరపాలక సంస్థ మేనేజర్‌గా పనిచేసిన మూర్తిని కలెక్టర్ ఆదేశాల ప్రకారం కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ బుధవారం సస్పెండ్ చేశారు. కారుణ్య నియామకం కింద ఒక ఉద్యోగి విషయంలో రూ.తొమ్మిది లక్షలు తీసుకుని ఉద్యోగం ఇచ్చారన్న ఆరోపణలపై ఆయనను సస్పెండ్ చేశారు. ఇదే విషయంలో అడిషనల్ కమిషనర్‌పై క్రమశిక్షణ చర్యలకు విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం.

పొగాకు పంటను పరిశీలిస్తున్న ప్రసాద్

పొగాకు సాగులో ప్రకృతి వ్యవసాయం మేలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వర్జీనియా పొగాకు పంట సాగులో ప్రకృతి వ్యవసాయం, పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియాను ప్రోత్సహించాలని బోర్డు రీజినల్ మేనేజర్ జివిఎల్‌కె.ప్రసాద్ రైతులకు సూచించారు. బుధవారం స్థానిక మర్కండేయపురం కూచిపూడి రమేష్‌కు చెందిన పొగాకు పొలంలో ప్రకృతి వ్యవసాయం, పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా వినియోగంపై క్షేత్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా వాడకంతో భూసారాన్ని పెంచవచ్చని సూచించారు. దీనివల్ల నాణ్యమైన పొగాకు అధిక దిగుబడి సాధించాలని పొగాకు రైతులకు సూచించారు. అలాగే పురుగుమందుల అవశేషాలు లేని మేలురకం పొగాకును పండించాలని తెలిపారు. అలాగే ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పొగాకు రైతులు కూచిపూడి రమేష్, తన్నీరు రామకృష్ణలు రూ.పదివేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఒకటో పొగాకు వేలం కేంద్రం వేలం నిర్వహణ అధికారి బి.శ్రీహరి, ఎస్‌జిఒ సుధీర్, ఐటిసి మేనేజర్ వెంకటేష్, జిపిఐ కంపెనీ ప్రతినిధి రవి, పొగాకు బోర్డు సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు

నోడల్ అధికారుల నియామకం

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. శాంతి, భద్రతలు, విఎంఅండ్‌జిల్లా సెక్యూరిటీ ప్లాన్ నోడల్ అధికారిగా ఎస్ఇబి అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, ఓటర్ల జాబితా నోడల్ అధికారిగా జెడ్‌పి సిఇఒ కెవిఎస్‌ఆర్.రవికుమార్, బైయాన్యూల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారిగా జెడ్‌పి సిఇఒ కెవిఎస్‌ఆర్.రవికుమార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎన్.బాలకృష్ణన్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, బ్యాలెట్ పేపరు బ్యాలెట్ బాక్సుల నోడల్ అధికారిగా జెడ్‌పి సిఇఒ కెవిఎస్‌ఆర్.రవికుమార్, ఏలూరు డిఎల్‌డిఒ రమణ, హెల్ప్ లైన్, ఫిర్యాదుల పరిష్కారం నోడల్ అధికారిగా జెడ్‌పి సిఇఒ, ఎన్నికల శిక్షణా నిర్వహణ నోడల్ అధికారిగా ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారిగా డ్వామా పీడీ రాంబాబు నియమితులయ్యారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిగా డిఇఒ ఎన్‌వి.రవిసాగర్, మెటీరియల్ మేనేజ్ మెంట్ నోడల్ అధికారిగా ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, ఏలూరు తహశీల్దార్ బి.సోమశేఖర్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిగా జిల్లా రవాణా కమిషనరు ఎం.పురేంద్ర, కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, ఐటి నోడల్ అధికారిగా జిల్లా ఇన్ఫర్మెటిక్ ఆఫీసరు(ఎన్‌ఐసి) జివిఎస్‌ఆర్.శర్మ, మీడియా కమ్యూనికేషన్ నోడల్ అధికారిగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.భవాని, పిఆర్ఒ ఆర్.రామచంద్రరావు, ఎన్నికల అబ్జర్వర్స్ నోడల్ అధికారిగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎన్.బాలకృష్ణన్, ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి నివేదికలు, కమ్యూనికేషన్స్ కోసం నోడల్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్‌ఎస్.మూర్తి, పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్ల నోడల్ అధికారిగా నరసాపురం సబ్ కలెక్టర్‌తోపాటు కొవ్వూరు, ఏలూరు, భీమవరం, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒలను నియమిస్తూ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత నోడల్ అధికారులు తమకు నిర్దేశించిన విధులను ఎన్నికల నిబంధనల మేరకు నిర్వర్తిస్తూ సకాలంలో సంబంధిత నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

గిరిజన హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి - పోలవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులను కాలరాస్తున్నాయని ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ విమర్శించారు. సంఘం పోలవరం మండల మహాసభ తామ బాలరాజు, తాటి శాంతి, మిడియం గంగాదేవి అధ్యక్షతన స్థానిక గిరిజన భవనంలో సోమవారం జరిగింది. సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకపక్క పోలవరం ప్రాజెక్టు మరో పక్కన తుపాకుల ఫ్యాక్టరీ, బొగ్గు గనులంటూ గిరిజన ప్రాంతాన్ని కుదిస్తూ గిరిజన హక్కులను కాలరాస్తున్నాయన్నారు. 30 ఏళ్లుగా సాగులో ఉన్న గిరిజన భూములకు పట్టాలివ్వకుండా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన గిరిజనులకు మౌలిక వసతులు, ప్యాకేజీలు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. మరోపక్కన 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రజా, గిరిజన వ్యతిరేక చర్యలకు తగిన మూల్యాన్ని చెల్లించుకుంటాయని విమర్శించారు. తొలుత గిరిజన సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘం నిర్వాసితుల సంఘం నాయకులు మడివి చలపతి, సాయికృష్ణ, గుడెల్లి వెంకట్రావు, బోరగం భూ చందర్రావు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి : సర్రాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు పని చేయాలని వైసిపి పోలవరం నియోజకవర్గ పరిశీలకులు పాతపాటి సర్రాజు అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులతో సమీక్షా సమావేశం జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాలసూర్యనారాయణరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడంలో సిఎం జగన్ సరికొత్త చరిత్ర సృష్టించారని తెలిపారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కరోనా సమయంలో సైతం సంక్షేమ పథకాలు అమలు చేశామని తెలిపారు. సంక్షేమ పథకాలు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రతీ సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, ప్రతి వాలంటీర్ పరధిలో ఇద్దరు గృహ సారధులు పనిచేస్తారని వివరించారు. కన్వీనర్లు, గృహసారధులు సమన్వయంతో ప్రతీఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ, అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందనివారు ఎవరైనా ఉంటే గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారికి కూడా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శ్రీను రాజు, సొసైటీ ఛైర్‌పర్సన్లు వాసిరెడ్డి మధు, దేవరపల్లి ముత్తయ్య, పిన్నమనేని చక్రవర్తి, కాల్నీడి సుబ్బారావు, కేతవరం సర్పంచి తడికలపూడి శివ మాధవి కిషోర్, బొంతు అంజిబాబు పాల్గొన్నారు.



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ప్రత్యేక పంచాయతీ కోరుతూ ఎంపీ కోటగిరికి వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కృష్ణాపురం, రుద్రకోటరాజుగూడెం, ప్రకాష్‌నగర్, పుట్రేపు, కాపుగూడెం గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆయా గ్రామాలకు చెందిన యువకులు చింతలపూడిలో బుధవారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా టి.నరసాపురం నుండి తొమ్మిది కిలో మీటర్ల దూరంలో ఉన్న రుద్రకోటరాజుగూడెం ఫీడర్‌కు విద్యుత్ సదుపాయం తోటల్లో నుండి రావడం వల్ల వర్షం వచ్చిన, చిన్నచిన్న గాలి వచ్చినా కరెంటు పోతుందని, దీంతో రుద్రకోటరాజుగూడెం, పుట్రేపు, ప్రకాశనగర్ ప్రజలకు తరచూ ఇబ్బంది కలుగుతుందని వివరించారు. అదేవిధంగా కృష్ణాపురం మెట్ట సమస్య, రోడ్డు సమస్యను కూడా ఎంపీకి తెలిపారు. స్పందించిన ఎంపీ విద్యుత్ సమస్యపై డిఇతో మాట్లాడి సమస్య పరిష్కానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్జా సాగర్, భూక్యా వేణు గోపాల్, గుండె మహరాజ్, ఎం.సూరిబాబు, కుంజా కిరణ్, పండు వీర భద్రుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ముసునూరు

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్‌అప్పారావు అన్నారు. మండలంలోని వలసపల్లిలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచి చలసాని దామోదరరావు, పేరం కృష్ణ, రాజబోయిన శ్రీనివాసరావు, శ్రీ దేవి, ఉపసర్పంచి దారగాని సుబ్బారావు, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ పాల్గొన్నారు.

అవార్డులు సామాజిక బాధ్యతను పెంచుతాయి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అవార్డులు, గౌరవ పురస్కారాలు సామాజిక బాధ్యతను మరింతగా పెంచుతాయని భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థ జాతీయ సేవారత్న గ్రహీత చిన్ని రామసత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక అంబికా రెస్టారెంట్ అండ్ లాడ్జి సమావేశ మందిరంలో అవార్డు నిర్వహణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిన్ని రామ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగ 360 మహాత్మాగాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహలను, కరోనా నమయంలో 40 గ్రామాలకు కరోనా నివారణ మందులు పంపిణీ చేయడాన్ని గుర్తిస్తూ రామ సత్యనారాయణకు జాతీయ సేవారత్న అవార్డు ఇచ్చిన్నట్లు తెలిపారు. రాష్ట్ర జానపద కళాకారుల సంఘం, జంగారెడ్డిగూడెం పట్టణ మానవ హక్కుల కమిషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. ఏలూరులో నిర్వహించే లిమ్కా అవార్డు కార్యక్రమానికి సైతం రామసత్యనారాయణను ఆహ్వానిస్తున్నట్లు, అక్కడ ఆయన సేవలను గుర్తించి పురస్కారం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రముఖ కధానాయకులు ఉక్కుర్తి దుర్గారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాకారులు, సంస్థ సభ్యులు కనపర్తి లక్ష్మీధనకుమార్, జొన్నకూటి వెంకటేశ్వరావు, అన్నపూర్ణదేవి, జి.సత్యనారాయణ, వెంకటేశ్వరావు, తిప్పాభట్ల రామకృష్ణ, హనుమంతరావు, కృష్ణబాబు పాల్గొన్నారు.

రామసత్యనారాయణను సత్కరిస్తున్న ప్రముఖులు

వైసిపిపై ప్రజలు విశ్వాసం కోల్పోయారు : బడేటి

ప్రజాశక్తి - ఏలూరు

తుగ్లక్ సిఎం జగన్ ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరిందని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బడేటి చంటి ఎద్దేవా చేశారు. ఏలూరులో బుధవారం జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏలూరు 45వ డివిజన్ ఆదివారపు పేట శివాలయం దగ్గర నుండి బడేటి చంటి పాదయాత్ర చేపట్టారు. ప్రతీఇంటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి పాలనలో ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారన్నారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు

అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పాదయాత్రలు వంటివి నిర్వహించకూడదని పోలీసులు బడేటి చంటి పాదయాత్రను అడ్డుకున్నారు. వివరణ కావాలంటే జెడ్‌పి సిఇఒను అడగాలని పోలీస్ అధికారులు చెప్పడంతో ఆయన పాదయాత్రను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏం ఘనత సాధించారని ఇంటింటికీ తమ స్టిక్కర్లు, సెల్ ఫోన్లపై తన చిత్రాలు వేయాలని సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే వైసిపి ప్రభుత్వంపై ప్రజలు నమ్మకం కోల్పోయారన్నారు. పాలకులు ఇప్పుడు తమ వింత చేష్టలతో వారిని గందరగోళానికి గురిచేసి లబ్ధపొందాలని చూస్తున్నారని, అయితే ఇది వృధా ప్రయత్నమేనన్నారు. జిల్లా కేంద్రమైన ఏలూరులో కూడా వింతపరిస్థితులు నెలకొంటున్నాయని బడేటి చంటి ధ్వజమెత్తారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేని పాలకులు వారిపై అధికారులతో పరోక్షదాడులకు సిద్ధమవుతున్నారన్నారు. చెత్త పన్ను, ఇంటి పన్ను వంటివి వసూలు చేసేందుకు ఆర్‌పి, సిఎల మీద అధికారులతో ఒత్తిడి చేయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజలకు ఫోన్లు చేసి సొమ్ములు చెల్లించకపోతే ట్యాప్ కనెక్షన్ కట్ చేస్తామని తమని కొంతమంది బెదిరిస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఏలూరు కార్పొరేషన్ పాలకులు నగర అభివృద్ధిని ఎప్పుడో గాలికి వదిలేశారని ఆయన విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలను ఇబ్బందులు పెట్టే అధికారం వారికి ఎవరిచ్చారని ఆయన నిలదీశారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.



పాదయాత్రను అడ్డుకుంటున్న పోలీసులు

బిబిసి ఛానల్‌పై బిజెపి వేధింపులకు ఎపిడబ్ల్యూజెఎఫ్ ఖండన

ప్రజాశక్తి - ఏలూరు

2002లో గుజరాత్ మత మారణహోమంలో నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నేటి ప్రధాని నరేంద్ర మోడీ పాత్రను బయట పెట్టినందుకు బిబిసి వార్తా ఛానల్‌పై వేధింపులకు దిగిన కేంద్ర ప్రభుత్వ చర్యను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. గుజరాత్ నరమేధంలో నరేంద్ర మోడీ పాత్ర గురించి ఇటీవల బిబిసి ఒక డాక్యుమెంటును ప్రసారం చేసిన నేపథ్యంలో ఢిల్లీలోని బిబిసి కార్యాలయాలపై ఆదాయపు పన్ను అధికారులు సెర్చ్ సర్వే పేరుతో దాడులకు దిగడం పత్రికా స్వేచ్ఛపై పరోక్ష సెన్సార్‌షిప్‌కు పాల్పడడమేనని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ చర్యలకు నిరసనగా ఈ నెల 17వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా 11 కేంద్రాల్లోనూ, అవకాశం ఉన్న ఇతర కేంద్రాల్లోనూ ప్రజాతంత్ర వాదులను కలుపుకుని ధర్నాలు నిర్వహించి అధికారులకు నిరసన పత్రాలు అందించాలని పిలుపునిచ్చింది. ప్రధాని మోడీ నిజస్వరూపాన్ని బయట పెట్టినందుకు ఇప్పటికే బిబిసి డాక్యుమెంటు లింకులను సామాజిక మాధ్యమాల్లో పెట్టడాన్ని నిషేధించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు నేరుగా ఆ వార్తా ఛానల్ పైనే దాడులకు దిగిందని పేర్కొంది. దేశంలో తనపై విమర్శలు చేసే మీడియాను అనేక విధాలా వేధింపులకు గురిచేస్తున్న ప్రభుత్వం ఇప్పుడు తనను విమర్శించే విదేశీ మీడియా పైన కూడా దాడులు చేయడం ద్వారా భారత దేశంలోని పరిస్థితులను ప్రపంచానికి చాటి చెబుతోందని పేర్కొంది. పత్రికా స్వేచ్ఛపై ప్రభుత్వం జరుపుతున్న ఈ దాడులను ఎడిటర్స్ గిల్డ్‌తో పాటు ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, కమిటీ టు ప్రొజెక్ట్ జర్నలిస్ట్స్, రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్, నేషనల్ ఎలియన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ సంస్థలు ఖండించాయి. భావ ప్రకటనా స్వేచ్ఛపై ఉక్కు పాదం మోపుతున్న నరేంద్ర మోడీ చర్యలను ఖండిస్తూ 17వ తేదీ ధర్నాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని రాష్ట్రంలోని పాత్రికేయులకూ, ప్రజాతంత్ర వాదులకూ పిలుపునిచ్చింది.

జయమంగళకు ఎంతో గుర్తింపు ఇచ్చాం

పార్టీ మారడం సరికాదు : కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - కైకలూరు

తెలుగుదేశం పార్టీలో జయమంగళ వెంకటరమణకు ఎంతో ఉన్నతమైన స్థానాన్ని పార్టీ అధిష్టానం కల్పించిందని, ఈ దశలో పార్టీని వీడడం నమ్మకద్రోహం చేసినట్లేనని పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మండలంలోని ఆటపాక మాగంటి నివాసంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలతో జగన్నాటకం ఆడుతున్నారని, రాష్ట్రాన్ని నాశనం చేశారని చెప్పారు. టిడిపి నాయకులపై అక్రమ కేసులు పెట్టి 26 మంది బిసి సోదరుల హత్యలకు కారకుడైన జగన్ పెట్టిన ప్రలోభాలకు రమణ చిక్కారన్నారు. జెడ్‌పిటిసి స్థాయి నుంచి ఎంఎల్‌ఎ స్థాయికి తీసుకొచ్చిన ఘనత టిడిపిదేనన్నారు. రెండు సార్లు ఎంఎల్‌ఎగా టికెట్ కేటాయించి, పార్టీనే ఆర్థికంగా సహకరించిందన్నారు. టిడిపి కొల్లేరును పచ్చగా చేస్తే, జగన్ బాంబులతో ధ్వంసం చేసి ఎడారిని చేశారన్నారు. స్వార్థం కోసం కొల్లేరు ప్రజల అభివృద్ధి అంటూ పార్టీ మారిన జయమంగళ చరిత్రహీనుడిగా మారిపోయాడన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకల్ల నారాయణ మాట్లాడుతూ జయమంగళ నిర్ణయాన్ని వ్యతిరేకించి కైకలూరు నియోజకవర్గంలో ఒక్క తెలుగుదేశం కార్యకర్త కూడా ఆయన వెంట వెళ్లకపోవడాన్ని అభినందించారు. రానున్న ఎన్నికల్లో 170 స్థానాలకు పైగా టిడిపి గెలుస్తుందని, చంద్రబాబు సిఎం అయిన వెంటనే జగన్ చేసిన నేరాలపై విచారణ జరుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు, పార్టీ పరిశీలకులు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందని, ఈ దశలోనే కార్యకర్తలు, నాయకులు ఐక్యతను చాటుకోవాలన్నారు. మాజీ మంత్రి, పార్లమెంట్ సభ్యులు మాగంటిబాబు, టిడిపి నాయకులు బొర్ర చలమయ్య, కొల్లేరు సాధికార కమిటీ అధ్యక్షులు భలే యేసురాజు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు, ఎంపిపిలు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దగ్ధమైన పూరిళ్లు

వృద్ధుడు సజీవ దహనం

ప్రజాశక్తి - ముసునూరు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమవ్వగా వృద్ధుడు సజీవ దహనమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గుడిపాడుకు చెందిన సోదరులు పిల్లి వెంకటేశ్వరరావు, పిల్లి నాగేశ్వరరావు వ్యవసాయ కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి వారికి చెందిన రెండు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. వారి తండ్రి పిల్లి అప్పారావు(70) ఆ మంటల్లో నుంచి బయటకు రాలేక దహనమయ్యాడు. ఈ ఘటనతో గుడిపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి.

బలివే ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

17 నుంచి 20 వరకు నిర్వహణ

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 2 లక్షలకుపైగా యాత్రికులు వస్తారని అంచనా

అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి- ముసునూరు

ఈ నెల 17 నుంచి 20 వరకూ జరిగే బలివే ఉత్సవాల నిర్వహణకు అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. దక్షిణ కాశీగా బలివేలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధిగాంచింది. ఈ ఆలయం పూర్వం కృష్ణా- పశ్చిమగోదావరి జిల్లాల మధ్య తమ్మిలేరు పరివాహక ప్రాంతంలో ప్రశాంత వాతావరణంలో ఉండేది. ఆ తర్వాత ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం బలివేలో తమ్మిలేరు నది ఒడ్డున ఏర్పడింది. అప్పటినుంచి నేటివరకూ ప్రతి శివరాత్రికి ఘనంగా ఉత్సవాలు జరుగుతున్నాయి.

విద్యుత్ అలంకరణలో ఆలయం

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు

తెలంగాణా రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా నుంచి, ఆంధ్రరాష్ట్రం ఏలూరు, ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల నుంచి సుమారు రెండు లక్షలకుపైగా భక్తులు వస్తారని అంచనా. అధికారులు ఐదు విభాగాలుగా నూజివీడు, ఏలూరు, సత్తుపల్లి ఆర్‌టిసి డిపోల నుంచి బస్సులు ఏర్పాటు చేశారు.

ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

ఏలూరు జిల్లాగా ఏర్పడిన తరువాత తొలిసారిగా ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ ఇఒ టి.విశ్వేశరరావు, గ్రామ సర్పంచి రావుప్రవీణ్ సుధాకర్, తహాశీల్దార్ (నోడల్ అధికారి) దాసరి సుధ, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఎస్‌పి అశోక్‌కుమార్ గౌడ్, సిఐ ఆర్.అంకబాబు, ఎస్ఐ ఎం.కుటుంబరావు, ఎంపిడిఒ జి.రాణిల పర్య వేక్షణలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. పలు దుకణాలు, వినోదం కోసం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇదీ ఆలయ పురాణం..

త్రేతాయుగంలో శ్రీరాముడు రావణ సంహారం అనంతరం బ్రహ్మ హత్య దోషనివారణార్థం మహాస్థలాలను ఎన్నుకొని ఈశ్వర లింగప్రతిష్టలు చేసుకుంటూ ఆయోధ్య చేరేముందు మహారణ్యమైన ఈ స్థలంలో ఆహ్లాదకరమైన వాతావరణం చూసి శివధ్యాన దృష్టి గల భూమిగా గ్రహించి ఇక్కడ ప్రతిష్టించాడు. అప్పటి నుంచి శ్రీరామలింగేశ్వరస్వామిగా పేరుగాంచి, అనంతరం బలి చక్రవర్తి పరిపాలించిన దేశంగా చెప్పబడింది. అందువల్ల ఈ ప్రదేశానికి బలివే అనే పేరు శాశ్వతమైందని చెబుతారు. పూర్వ కాలంలో 101 లింగ ప్రతిష్టలు ఉండేవి. కాలక్రమేణా అవి శిథిలం కాగా 4, 5 మాత్రమే మిగిలాయి. వీటిలో ముఖ్యమైన లింగ ప్రతిష్ట శ్రీ మృత్యుమల్లేశ్వరస్వామి ఆలయం (దీనినే తాతగుడి)గా పిలుస్తారు. ప్రతీ ఏడాది కళ్యాణం అనంతరం తాతగుడిని దర్శించుకోవడం ఆనవాయితీగా దేవదాయ శాఖ, గ్రామస్థులు సంప్రాదాయంగా చేపడుతున్నారు.



సచివాలయం వద్ద బాధితురాలు

అర్హత ఉన్నా అందని చేయూత

బాధితురాలి ఆవేదన

ప్రజాశక్తి - ముసునూరు

అన్ని అర్హతలున్నా తనకు చేయూత పథకం అందడంలేదని ముసునూరు గ్రామానికి చెందిన రంగోజు కృష్ణకుమారి ఆవేదన వ్యక్తం చేస్తుంది. పలుమార్లు సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితం ఉండడంలేదని వాపోతుంది. ఆమె మధుమేహంతో బాధపడుతోంది. నడవలేని స్థితిలో తన భర్త ఆండతో చేయూత పథకం కోసం ముసునూరు సచివాలయం చుట్టూ రెండేళ్ల నుంచి తిరుగుతూనే ఉంది. అధికారులు స్పందించడంలేదని, తన సమస్య పరిష్కరించడంలేదని వాపోతుంది. ఆన్‌లైన్ అవ్వలేదని, స్టేటస్‌లో పేరు రావడంలేదని సచివాలయ సిబ్బంది చెబుతూ వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఈ సమస్యను నూజివీడు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లింది. అన్ని అర్హతలున్నా తనకు చేయూత పథకం అందలేదని ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ఈ సమస్య జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అసలు సచివాలయంలోనే చేయూత పథకానికి వైబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయలేదని చెబుతున్నారని రంగోజు కృష్ణకుమారి ఆవేదన వ్యక్తం చేస్తోంది. తాను మధుమేహంతో బాధపడుతున్నానని, ఈ పథకం సొమ్ము పడితే వైద్యం చేయించుకుంటానని వాపోతుంది. అధికారులు స్పందించి తనకు చేయూత పథకం సొమ్ము అందేలా చూడాలని కోరుతోంది.

ముసునూరులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - ముసునూరు

మాట్లాడుతున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు తగ్గాలంటే టిడిపి అధినేత చంద్రబాబునాయుడుకు ఓటు వేయాలని ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ముసునూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు నుంచి రోజు వారి కూలీ వరకు అందరూ వైసిపి హయాంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దేవినేని ఢలరామ్, బిసి సెల్ ఆర్గనైజింగ్ నియోజకవర్గ సెక్రటరీ నక్కా యోహాన్, టిడిపి మండల నాయకులు పాకనాటి సీతారామ్, నల్లిబోయిన రాంబాబు, తలకోండ సర్పంచి కోండేటి విజయలక్ష్మిబాబి, కాట్రేనీపాడు సర్పంచి గద్దల సుహాసని మోహానరావు, మానికల శ్రీను, ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పాతాళ భోగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలు

ప్రజాశక్తి - కలిదిండి

మహా శివరాత్రికి ఉత్సవాలకు శ్రీ పాతాళ భోగేశ్వరాలయం ముస్తాబైంది. ఈ నెల 16వ తేదీ గురువారం నుంచి శ్రీ పార్వతీ సమేత శ్రీ పాతాళ భోగేశ్వరస్వామికి పాంచాహినిక దివ్య కళ్యాణ మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతాయని ఆలయ ఇఒ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. లక్షలాదిగా యాత్రికులు తరలి వస్తారన్నారు. ఆలయాన్ని రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్లు వేశారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇఒ తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ మహోత్సవాలను కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. యాత్రికుల రాకపోకలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ ఆదేశాల మేరకు సిఐ వైవిఎల్.నాయుడు పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

నేరాలు - ఘోరాలు

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామానికి చెందిన ఏసు మరియమ్మ పదేళ్ల క్రితం భర్త నుంచి విడిపోయింది. ఈ క్రమంలో బొమ్ములూరు గ్రామానికి చెందిన దేవరపల్లి రవీంద్ర (రవి)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. మరియమ్మ తన కుమార్తెతో కలిసి కాట్రేనిపాడులోనే నివాసం ఉంటుంది. మరియమ్మ సంపాదన, డ్వాక్రా డబ్బులు, ఆఖరికి కరెంటు బిల్లులకు ఇచ్చిన డబ్బులు సైతం ఖర్చు చేస్తూ మద్యం సేవించటం, చెడు వ్యసనాలకు బానిసగా మారాడు రవీంద్ర. ఈ నేపథ్యంలో మరియమ్మ అతడిని కాస్త దూరం పెడుతూ ఉండడంతో ఇరువురి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మరియమ్మను, ఆమె కుమార్తె అఖిలను కడతేర్చాలని పథకం రచించాడు. రవీంద్ర అతని స్నేహితుడు మంగి భువనేశ్వరరావు (చందు) సహాయంతో ఈ నెల 3న రాత్రి మరియమ్మ ఇంట్లోకి వెళ్లి ఆమె తలపై సుత్తితో కొట్టాడు. దీంతో ఆమె మృతి చెందింది. అదే సమయంలో లేచిన కుమార్తె అఖిలను కూడా సుత్తితో బలంగా మోదటంతో ఆమె చనిపోయింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హత్య చేసిన ఇద్దరికీ పారిపోయేందుకు, హత్య సంఘటనను గోప్యంగా ఉంచిన రవీంద్ర సోదరి మట్టా కుమారి, అబ్బదాసరి శ్రీనులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్యచేసిన రవీంద్ర, భువనేశ్వర్ ఏలూరు నగరంలోనే ఉన్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఏలూరు వన్ సిఐ బోనం ఆదిప్రసాద్ తన సిబ్బందితో కలిసి వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపిన నూజివీడు రూరల్ సిఐ అంకబాబు, ఎస్ఐ కుటుంబరావు, నూజివీడు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా ఆభినందించారు.

సిఐ ఆది ప్రసాద్‌కు ప్రశంసాపత్రం

జంట హత్య కేసుల్లో అత్యంత ప్రతిభ కనబరిచి నిందితులను అరెస్టు చేయడంలో ఎంతో శ్రమించిన ఏలూరు ఒకటో పట్టణ సిఐ ఆదిప్రసాద్‌ను జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్‌శర్మ ప్రశంసా పత్రాన్ని అందించి ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మాట్లాడుతున్న షేక్ సాబ్జీ

బంజారాల సంస్కృతి సాంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసి జాతి మొత్తాన్ని ఏకం చేయడం కోసం భారతదేశం అంతటా తిరిగి ధర్మ బోధన చేసిన మహనీయుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జీ అన్నారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏలూరులోని స్వెట్ ఫిట్ నెస్ సెంటరు ఆవరణలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలను ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గుగ్గులోతు కృష్ణ నాయక్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి సాబ్జీ మాట్లాడుతూ భారతదేశం అంతటా వ్యాపించి సుధీర్ఘమైన ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన ఆదివాసి బంజారా జాతి అని కొనియాడారు. బంజారా జాతి పూజించే ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ అని, దేశం అంతటా ప్రతి తండాల్లో సేవాలాల్ జయంతి వేడుకలు జరపడం సంతోషదాయకమన్నారు. అధ్యక్షత వహించిన గజిలోతు కృష్ణనాయక్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 16 కోట్ల మంది బంజారాలు, లంబాడీలు పూజించే ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ అని తెలిపారు. బంజారా జాతిని జాగృతం చేసిన ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా బంజారా లంబాడీలు నడవాలని పిలుపునిచ్చారు. ప్రతి జిల్లాకు రూ.పది లక్షల నిధులు విడుదల చేయాలని, సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించి ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. శాసనమండలి మాజీ సభ్యులు ఆర్.సూర్యారావు, ఎస్‌టి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎఐబిఎస్ఎస్ నాయకులు బాణావతు మోహనరావు, భూక్యా నాగరాజు నాయక్, ధారావతు చోక్లా నాయక్, గుగ్గలోతు బాలూ నాయక్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా బంజారాలు మాట్లాడే గోర్ బోలీని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చి గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాణావతు రమాదేవిబాయి, ధారావతు అరుణాబాయి, నాయకులు శ్రీనునాయక్, ఎ.సోమరాజునాయక్, సాంబూనాయక్ పాల్గొన్నారు.

చింతలపూడి : అంబేద్కర్ రాజ్యాంగబద్ధంగా అందరికీ సమాన హక్కులు కల్పించారని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణంలో మార్కెట్ యార్డు వద్ద ఎస్‌టి బంజారా సుగాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ ఎంఎల్ఎ ఎలిజాతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బంజార లంబాడిలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి సేవాలాల్ అని కొనియాడారు. దేశ వ్యాప్తంగా సేవాలాల్ సేవలు గుర్తించాలన్నారు. సాంఘిక అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు అని, బంజారాలను, లంబాడిలను ముందుకు నడిపిన మహనీయుడు అని అన్నారు. అనంతరం ఎంఎల్ఎ ఉన్నమాట్ల ఎలిజా మాట్లాడుతూ సేవాగుణం, నిస్వార్థం, జాతీయ అంకితం భావం కలిగిన వ్యక్తి సేవాలాల్ అన్నారు. జాతి కోసం ప్రాణం త్యాగం చేశారని, లంబాడి హక్కుల గురించి పోరాడారన్నారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఒక జాతిని మరోక జాతి అభివృద్ధి చేసినట్లు చరిత్రలో లేదని, ఎవరి జాతులను వారే అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. లంబాడిల ఆచారాలు, సంప్రదాయలు కాపాడుకోవాలన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశం గొప్పదనం అన్నారు. బంజార ప్రజల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం ఎపి లంబాడి హక్కులు పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజాసు ధాకర్, రాష్ట్ర ముఖ్య నాయకులు శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనలో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - భీమడోలు

ఎలుకల నిర్మూలన మందు పంపిణీ చేస్తున్న మాన్‌సింగ్

ఎలుకల నిర్మూలనలో పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని భీమడోలు వ్యవసాయ అధికారి ఉషారాణి కోరారు. మండల పరిధిలో 13,700 ఎకరాల సాగు విస్తీర్ణం, 1400 ఎకరాల విస్తీర్ణంలో ఖాళీ భూముల్లో ఎలుకల నిర్మూలనకు వ్యవసాయ శాఖ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం మండల పరిధిలోని 14 రైతు భరోసా కేంద్రాల వద్ద బుధవారం నిర్వహించారు. భీమడోలులో వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామపంచాయతీ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తయారుచేసిన ఎలుకల నిర్మూలన మందు బ్రోమోడయోలిన్ పంపిణీ కార్యక్రమాన్ని భీమడోలులో చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టాల్సి ఉన్న నేపథ్యంలో రైతులందరు భాగస్వాములు కావాలని కోరారు. ఎలుకలకు పరిసరాల పరిశీలన శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. ఏదైనా ఎలుక తాను ఆపదలో ఉన్న, దాని వల్ల చనిపోయే సమయంలో సైతం ఇతర ఎలుకలను ప్రమాదం పట్ల అప్రమత్తం చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అవసరం మేరకు ఎలుకల పునరుత్పత్తిని రెట్టింపు చేస్తుందన్నారు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఎలుకల నిర్మూలన సమస్యలను అధిగమించేందుకు, ఎలుకలకు తప్పుడు సమాచారం ఇచ్చే బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు



విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు

ప్రజాశక్తి - భీమడోలు

జిల్లా కేంద్రమైన ఏలూరుతో పాటు దాని పరిసరాల్లో పలు మండలాలకు గల విద్యుత్ సరఫరా సమస్యలు తీర్చేందుకు ట్రాన్స్ కో అదనపు ప్రత్యామ్నాయ విద్యుత్తు లైను ఏర్పాటు చేస్తుంది. దీనికోసం భీమడోలు విద్యుత్ సబ్ స్టేషన్ కేంద్రంగా పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు భీమడోలుకు వచ్చే విద్యుత్‌ను మాత్రమే ఏలూరు పరిసరాలకు సరఫరా చేసేవారు. దీనిలో దీనిలో అంతరాయాలు ఏర్పడితే ఏలూరుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. తాజాగా సమస్య పరిష్కారానికి ట్రాన్స్ కో అధికారులు అదనపు ప్రత్యామ్నాయం కోసం 18 కిలోమీటర్లు పొడవున కామవరపుకోట 400 కెవి విద్యుత్ ఉపకేంద్రం నుంచి భీమడోలు 220 కెవి విద్యుత్ ఉప కేంద్రం వరకు అదనపు విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం విద్యుత్ లైన్లు వేసే క్రమంలో జాతీయ రహదారి మీదుగా పనులు చేపట్టాల్సి రావడంతో ట్రాన్స్ కో అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు భీమడోలు పోలీసుల సహకారం తీసుకున్నారు. ఈ సందర్భంగా నిర్మాణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న ట్రాన్స్ కో(కనస్ట్రక్షన్) ఏలూరు డిఇఇ వి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న నూతన విద్యుత్ లైన్ వల్ల భీమడోలు విద్యుత్ కేంద్రానికి సాధారణంగా వచ్చే మార్గం ద్వారా విద్యుత్ నిలిచిపోయినప్పటికీ కామవరపుకోట నుంచి భీమడోలు వరకు విద్యుత్ శాఖకు అదనపు ప్రత్యామ్నాయ విద్యుత్ లైను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనివల్ల భీమడోలుకు అదనపు విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. దీనివల్ల నిబంధన మేరకు నాణ్యమైన విద్యుత్ సరఫరా లో ఓల్టేజ్, ఇతర సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. అత్యవసర సమయంలో సైతం 24 గంటల విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎస్ఐ చావా సురేష్ పాల్గొన్నారు.

నత్త నడకన జగనన్న ఇళ్ల నిర్మాణం

ప్రభుత్వ సాయం సరిపోక లబ్ధిదారుల ఇబ్బందులు

మౌలిక సదుపాయాలు కల్పించని వైనం

ప్రజాశక్తి - గణపవరం

గోతులతో ఉన్న జగనన్న కాలనీ రహదారి

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం నత్త నడకన సాగుతోంది. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ అందించే సొమ్ము సరిపోక లబ్ధిదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలేదని వాపోతున్నారు. 2021లో గణపవరం శివారు సరిపల్లి గ్రామపంచాయతీకి సంబంధించిన 8 ఎకరాలను ఇళ్ల స్థలాలుగా ఇచ్చేందుకు ప్రభుత్వం సేకరించింది. గణపవరం, సరిపల్లి, కొమ్మర, వాకపల్లి గ్రామానికి చెందిన 640 మందికి ఇళ్ల పట్టాలు అందించారు. తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి అన్న చందంగా ఇక్కడ నుంచి లబ్ధిదారులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. స్థలం వచ్చినందుకు ఆనందంగా ఉన్నా ఇల్లు ఎలా నిర్మించాలో తెలియని స్థితిలో లబ్ధిదారులు ఉన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలు సరిపోవడంలేదని వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలతో రూ.8 లక్షల వరకు ఇంటి నిర్మాణానికి ఖర్చవుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. ఇంటికి ఐరన్, ఇటుకలు, సిమెంటు, సామగ్రికి ఇలా అన్ని ఖర్చులు కలుపుకుని ఇంటి నిర్మాణానికి రూ.8 లక్షలు అవుతాయని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు కాకుండా తాము సొంత సొమ్ము భరించాల్సి ఉంటుందని చెబుతున్నారు. పేదలమైన తాము ఇల్లు నిర్మించుకోలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. జగనన్న కాలనీ గ్రామానికి శివారు కావడం వల్ల ఇంటి నిర్మాణానికి సంబంధించిన సామగ్రిని తీసుకెళ్లడానికి అదనంగా రవాణా ఖర్చులు అవుతున్నాయని చెబుతున్నారు. స్థలాలు ఇచ్చి ఏడాది గడిచినా కాలనీలో రహదారులు నిర్మించలేదని, విద్యుత్ సౌకర్యం కల్పించలేదని వాపోతున్నారు. ఏదోవిధంగా ఇబ్బందులు ఎదుర్కొని ఇంటి నిర్మాణం చేస్తున్న 25 మంది లబ్ధిదారులు సాయంత్రం ఐదు అయ్యేసరికి తమ పనులు పూర్తి చేసుకుని బయటికి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. చీకటి పడితే విషపురుగులు తిరిగే అవకాశాలు ఉన్నాయని భయాందోళనకు గురవుతున్నారు. ఇల్లు నిర్మించుకోకపోతే ఇచ్చిన స్థలాన్ని ప్రభుత్వ అధికారులు వెనక్కి తీసుకుంటారేమోనన్న భయంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగనన్న కాలనీలో పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగాలంటే స్థానిక బ్యాంకుల ద్వారా రుణాలు అందించే అవకాశాలు కల్పించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్రం, జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ల్యాబ్ టు స్కూల్ ప్రోగ్రాం సైన్స్ విద్యార్థులతో నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ప్రారంభ సభకు అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు షేక్ మీరాసాహెబ్ మాట్లాడుతూ ఇటువంటి ప్రయోగాలు విద్యార్థుల్లో చైతన్యాన్ని కలిగిస్తాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరపున వైస్ ప్రిన్సిపల్ డి.రెడ్డయ్య, భౌతిక శాస్త్ర అధ్యాపకులు బి.వెంకటేశ్వర్‌రెడ్డి, జంతు శాస్త్ర అధ్యాపకులు బి.రాజు, గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి.బాబురావు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. హై స్కూల్ స్థాయి నుంచి విద్యార్థులకు సైన్స్ పట్ల అభిరుచిని కల్పించి, నూతన ఆవిష్కరణల వైపుగా విద్యార్థులను నడిపించే ఉద్దేశంతో డిగ్రీ విద్యార్థులు సొంతంగా రూపొందించిన వివిధ ప్రయోగాలను నారాయణపురం జిల్లా పరిషత్ హై స్కూల్లో ప్రదర్శన ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని రుచికరంగా వండి పెట్టే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ పి.మల్లేశ్వరి తెలిపారు. చింతపాడు పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ శాతం పేద విద్యార్థులే విద్యను అభ్యసిస్తూ ఉంటారన్నారు. అంకిత భావంతో వారికి క్రమశిక్షణతో కూడిన విద్యను అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అంతేకాకుండా ఆర్థిక సమస్యలు విద్యార్థి విద్యాభివృద్ధికి ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. పాఠ్యపుస్తకాలు, ఏకరూపు దుస్తులు, మధ్యాహ్న భోజన పథకంతో పాటు పాఠశాలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను ఏర్పాటు చేసి పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. విద్యార్థులు సౌకర్యాలను అందిపుచ్చుకొని క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను ఏకాగ్రతతో శ్రద్ధతో అలకించి చదివి విద్యలో రాణించి తల్లిదండ్రులకు గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆమె కోరారు. అనంతరం ఆమె పాఠశాల పరిసరాలు పరిశీలించి మధ్యాహ్న భోజన పథకం వండే విధానాన్ని పరిశీలించి రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కేశవరం హైస్కూలు విద్యార్థులకు కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం కంటి పరీక్షలు నిర్వహించారు. హైస్కూలులో 286 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వారిలో 16 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు నేత్ర వైద్యులు ఐ.శ్రీనివాస్ తెలిపారు. కళ్లజోళ్లు అవసరమైన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తుందని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపవరం సిహెచ్ఒ జె.విల్సన్‌బాబు. స్కూలు హెచ్ఎం ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - చింతలపూడి

ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్ కచ్చితంగా ఉండాలని చింతలపూడి ఎస్ఐ హరికృష్ణ అన్నారు. చింతలపూడి పట్టణంలో గురుభట్లగూడెం రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, అధిక వేగంతో వాహనాలు నడపకూడదని చెప్పారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814